# కారుణ్యం

రా. భరద్వాజ

మేనేజరు యిస్తున్న మూడు పది రూపాయిల కాగితాలు చూస్తుంటే నారాయణకు వొళ్లు గగుర్పొడిచింది. నెత్తురు వుప్పెనలాగా బుసబుసా పొంగింది. కళ్లు చెమ్మగిల్లినై. కంఠం జీరపడింది. పాపం నాలుగు సంవత్సరాలకు చెలువుగా ఇవ్వాళే మాత్రమే నారాయణ ముప్ఫయ్ రూపాయలు వొక్కసారిగా చూడగలిగాడు. అంటే వేలకువేల రూపాయల్ని సిల్కు లాల్చీల్లోనూ, కోటుల్లోనూ, పర్సుల్లోనూ అతను చూడకపోలేదు. ఇంత కాలమూ గుడ్డిగావుండి ఇప్పుడు మంచివాడు అయ్యాడనీగాదు. అతని చేతికి వొచ్చింది మాత్రం ఇవ్వాళే; అంతవరకూ నిజం.

ఈ నాలుగు సంవత్సరాలూ నారాయణ యమ యాతనలుపడ్డాడు. కూటికీగుడ్డకూ ముఖంవాచాడు. అద్దె ఇవ్వలేకపోయినందుకుగాను చాలాసార్లు యజమానులచేత కుండా చట్టీ బైటపడేయించుకొన్నాడు. పాపం అతని కా పట్నంలో వుండడానికి కొంప దొరక్కుండా పోయింది చివరికి.

దురదృష్టవశాత్తూ నారాయణ భార్య గొడ్డుబోతురాలుగాదు. ఆవిడ కాపరానికొచ్చిన ఏణ్ణర్థంలోపలనే వొక జీవిని భూమిమీదికి దించింది. మరొకదాన్ని కొన్నివారాలలో దింపబోతూ వుంది. నారాయణకు సంపాదించడం చాతగాదు. అంటే మోసంచేయడం చాతగాదు. కనీసం అతనికి నాలుగెకరాల పొలమయినా లేదు. నారాయణ తండ్రి చాలా తెలివయినవాడు. పిత్రార్జితం తింటూ తన కొడుకు సోమరిపోతు గాకుండా ఆయన చనిపోయేనాటికి జాగ్రత్తపడ గలిగాడు. అంతేగాదు; భారతదేశపు నగ్నస్వరూపాల్ని కొడుక్కు చూపించాలనుకొన్నాడల్లేవుంది. రెండువేలు అప్పుచేసి మరీచచ్చాడు. అయితే వొకటి. ఇల్లొకటి మాత్రం వొదిలిపోయాడు. తండ్రి చచ్చిన రోజున బాకీకింద ఇల్లు జమకట్టి గుండెల మీద బరువు దించుకొన్నాడు నారాయణ.

నారాయణ అత్తవారు దరిద్రులు. అతని మామ యాయవారంచేసేవాడు. కాపరానికొచ్చేటప్పుడు పార్వతి నిరాభరణ సుందరి. పీట్లపెట్టిన ఎనిమిదివందల సొమ్మూ ఆ పెద్దమనిషి వూరిబైట పాటిదిబ్బకు అప్పగించాడు. సొమ్మును గురించి నారాయణ తండ్రి చాల గొడవచేశాడు. వియ్యాంకుణ్ణి చెప్పుతో కొట్టబోయాడు. 'డబ్బుతో సహా వొస్తేనే నాయింటో కాలుబెట్ట' మనిపార్వతితో అన్నాడు. పార్వతి ఏడ్చింది. తండ్రిచేసిన తప్పుకై తనూశిక్ష అనుభవించాలి సొచ్చింది! తండ్రిని సర్దేటప్పటికి నారాయణ జావయిపోయినాడు.

ఉద్యోగంకోసం నారాయణ పట్నం చేరుకొనేప్పటికి అతనివద్ద పాతిక రూపాయలకంటే ఎక్కువ లేవు. నెలకు తొమ్మిది రూపాయల అద్దెమీద వొక వూరికొంప వూరికి దూరంగా సంపాదించడం సులభంగాదనే విషయం నారాయణ అనుభవంమీద తెలుసుకోగలిగాడు. వారం రోజులకల్లా అతను 'ఈపూట' తిండిని గురించి ఆలోచించవలసొచ్చింది. 'డికెన్సు' నవలలు, 'షా' నాటకాలు, 'మొపాసా' కథలు అతన్ని రెండు నెలలు పోటాపోటీగా పోషించినయ్. ఫౌంటెన్ పెన్ను మూడు రోజులు కారంమెతుకులు పెట్టింది.

అదృష్టవశాత్తూ నారాయణ కమ్యూనిస్టుకాడు. కనీసంవాళ్ళ స్నేహమయినా అతనికి లేదు. మార్క్సు పుస్తకాలుగానీ, రష్యా సంగతిగానీ అతనికి తెలీదు. తన దరిద్రానికి, ఆకలికీ, దుఃఖానికి, సమాజవిధానమే కారణమనికూడా ఆతనికి తెలీదు. ఎన్నో తరాలనించీ వొస్తున్న కర్మసిద్ధాంతం తాలూకు రక్తం అతనిలో చాలా వుంది. తన స్థితి కంతటికీ కారణం; కనిపించని భగవంతుడిమీదికి నెట్టాడు. 'నారాత' అని నుదిటిమీద కొట్టుకొన్నాడు.

పార్వతికి దరిద్రం అనుభవించడం అలవాటు. చిన్నతనంలో అనేకసార్లు రెండేసి రోజులు అన్నం లేకుండావుంది. వొక్క చీరతో సంవత్సరం గడిపింది. కానీ ఇల్లాంటి దరిద్రం మాత్రం కాదు. దానికీదీనికీ చాలా భేదమున్నదని పార్వతికి తెలుసు. అది స్పష్టంగా చెప్పడం మాత్రం పార్వతికి చాతకాదు. మురికి ప్రదేశంలోవుండడంవల్లా, వేళకు తిండిలేకపోవడంవల్లా పార్వతికి జబ్బుచేసుకొచ్చింది. అందులో నీళ్ళాడే రోజులు. బలమయిన మందులు వాడవలసిన అవసరం ఎంతయినా

వుంది. ఆ సంగతి నారాయణకు తెలియకపోలేదు. అతనికి భార్య ఆరోగ్యంగా వుండాలనేవుంది. మరి...... ?

తన స్థితినంతా చెప్పి వొక గుమాస్తా దగ్గర పావలా సంపాదించాడు; వొక జర్నలిస్టు అతని కథ విని పోస్టల్ స్టాంపులకోసం వుంచుకొన్న చిల్లర ఇచ్చాడు. ఒక విద్యార్థి మూడణాలు యిచ్చాడు. నారాయణ కుటుంబానికి వొకరోజు చాలు. వాళ్ళతో తన కథ (?) చెబుతున్నప్పుడు నారాయణ అభిమానపడ్డాడు. తల నరికేసినట్లయింది. కళ్ళమ్మట నీళ్ళొచ్చినయ్.

ఆ తెల్లవారి మళ్ళీ మామూలు. యాచన తప్ప లేదు. దీనివల్ల అతని జీవితం గడవనిమాట నిజమే. ప్రాణాలు మాత్రం పోవు. చావుబతుకుల మధ్య మార్జిన్ కావాలంటే అడుక్కునేవాళ్ల జీవితంలో దొరుకుతుంది. నారాయణ దాదాపు నాలుగు సంవత్సరాలు ఆ మార్జిన్‌మీదినించి కదలలేక పోయాడు. ఈలోపుగా అతని భార్య వొకసారి ప్రసవించింది. అయిదుసార్లు చావలేక బతికింది. అతను అనేకసార్లు కొంపల్లోంచి వెళ్లగొట్టబడ్డాడు.

నారాయణదృష్టిలో అతని అదృష్టం వెలుగు చూసింది. వొక బొంబాయి కంపెనీలో నెలకు ముప్ఫయ్ రూపాయిల పని దొరికింది. నారాయణ కళ్ళకు రోలర్‌లాగా వున్న సేఠ్ భగవంతుడల్లే కనిపించాడు. ఆనాటిరాత్రి పార్వతికి నిద్ర బట్ట లేదు. నారాయణకు అంతకుముందే లేదు.

ఒకటో తారీఖున మేనేజరుముప్ఫయిరూపాయలిచ్చాడు. వాటిని చూస్తుంటే నారాయణకు వొళ్ళు గగుర్పొడిచింది. నెత్తురు వుప్పెనలాగా బుసబుసా పొంగింది. కళ్లుచమ్మగిల్లినై. కంఠం జీర పడింది. వొణుకుతూ వాటిని తీసుకొని బైటికొచ్చాడు.

చాలామంది ముష్టివాళ్లు అతని చుట్టూ మూగారు. భారతదేశ నగ్నస్వరూపాలు. సంఘం కక్కిన వెధవలు (?) - వొకడికి కాళ్లులేవు. వొకడికి కళ్లులేవు. వొకడు కుష్ఠురోగి. వొకతె గర్భిణి. ఈ గర్భాలుగూడా దరిద్రులకే ఎక్కువ. ఎండిపోయి బొమికెల గూడులా కుకకుసు లాడుతున్నారు. తోటి గుమాస్తాలు వాళ్ళని ఈగలు తోలినట్టు తోలిపోతున్నారు. నారాయణ పోలేదు. పోలేదుగూడాను. అతను నిన్నటిదాకా బతికింది ఆ వాతావరణంలో. ఇంతలోకే ఆవంకటింకర కాయాలేమిటో నని సందేహపడలేదు. వాళ్ళజీవితం ఎటువంటిదో నారాయణకు క్షుణ్ణంగా తెలుసు. ఆకలికి ఎంతటిశక్తి వుందో అనుభవపూర్వకంగా నారాయణ తెలుసుకొన్నాడు.

తనదగ్గర నోట్లల్లో వొకదాన్ని చిల్లరగా మార్చాడు, ముష్టివాళ్ళకి అణా చొప్పున యిచ్చాడు. రెండణాలు ట్రాంచార్జీ కిందయిపోయినయ్. అతను మూల తిరుగుతున్నాడు. ఇరవై ఏళ్ళ ఆడది కనిపించింది. నల్లగా, బక్కగా వుంది. కొంకరబోయిన మొఖం దాని జీవితాన్ని దాచలేదు. మొగుడు మిలటరీలో కెళ్ళి మూడు సంవత్సరాలయింది. రెండేళ్ళకొడు కొకడున్నాడు. ఇది చాలు దాని బతుకు తెలుసుకోడానికి. కూటికోసం అది రోజు కొకణ్ణి 'ప్రేమి'స్తుంది.

నారాయణ దానిచేతిలో మూడు రూపాయిలుంచి చరచరా ముందుకు సాగాడు. వొక ముష్టిపిల్లాడికి అర్థ రూపాయిచ్చాడు. నారాయణ తేలిపోతూ నడిచాడు. దానం చేయడం తనశక్తికి మించినపనని నారాయణకు తోచలేదు. 'ఎవ్వరూ ఇవ్వకపోతే ఈ నాలుగు సంవత్సరాలూ నా గతేమిటి ?' అనుకొన్నాడు.

పార్వతి చేతికిచ్చాడు మొత్తం డబ్బు. లెక్కబెట్టింది. ఇరవైరూపాయిల ఆరణాలు జీతం ముప్పయ్యని పార్వతికి బాగా జ్ఞాపకం. నారాయణ్ణి అడిగింది. చెప్పాడు. పార్వతి రుసరుసలాడింది.

'ముప్ఫయ్ రూపాయల్లో కూటికీ గుడ్డకూ గాకుండా ఇట్లా దుబారాచేస్తే ఎట్లా? దేశంలో తిండిలేనివాళ్లు చాలామంది వున్నారు. వాళ్లందరినీ మీరు పోషిస్తారా ఏమిటి ? ఇందులో పదిహేను రూపాయలు ఇరుగుపొరుగువాళ్లకియ్యాలి. జీతం రాగానే ఇస్తానని తెచ్చాను. నెలరోజులు ఎట్లా గడిచినయ్యనుకొన్నారు ? మిగిలిన ఐదు రూపాయిలతో నెలరోజులు ఎట్లా గడపాలో నాకర్థంకావడంలేదు.'

నారాయణ పెరిగినగడ్డాన్ని గోక్కున్నాడు-